

సర్వాంతర్యామి.. సదా స్మరామి

సర్వాంతర్యామి.. సదా స్మరామి అంటూ ఆ వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచింది. గోవింద హరి గోవిందా అంటూ మనసారా స్మరించింది.




బ్యారేజీపై రాకపోకలకు మరో 5 రోజులు బ్రేక్

కాటన్ బ్యారేజీపై మరో ఐదు రోజుల పాటు రాకపోకలు నిలిపివేయనున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు.

8లో

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన బాల బాలాజీ ఆలయం



అప్పనపల్లిలో బాల బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: కలియుగ ప్రత్యక్ష దైవంగా బాసిల్లుతున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన ఆ స్వామిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. ఉదయమే పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేర్చాలని స్వామివారిని వేడుకున్నారు. భక్తుల రాకతో పాత, కొత్త ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామివారి సన్నిధిలో శ్రీలక్ష్మీనారాయణ హోమం వైభవంగా జరిగింది. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.1.99 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.1.51 లక్షల ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.48,358 విరాళాలుగా సమర్పించారు. 3,095 మంది స్వామివారిని దర్శించుకోగా, 2,268 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హాజరు కానున్న 7,846 మంది విద్యార్థులు



వనుము సోమశేఖరరావు

రాయవరం: ఇంటర్మీడియెట్ జనరల్ ప్రాక్టికల్స్ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 5వ తేదీ నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే జనరల్ ప్రాక్టికల్స్ ఈ నెల 20వ తేదీ వరకూ కొనసాగుతాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు స్పెల్స్‌లో నిర్వహిస్తారు. జిల్లాలో మొదటి స్పెల్‌లో 47 పరీక్ష కేంద్రాల్లో 11 నుంచి 15వ తేదీ వరకూ, రెండో స్పెల్‌లో 24వ తేదీ వరకూ ప్రాక్టికల్స్ ఉంటాయి. విద్యార్థులు అధికంగా ఉన్న 11 పరీక్ష కేంద్రాల్లో రెండు స్పెల్స్‌లో నిర్వహిస్తుండగా, మిగిలిన కేంద్రాల్లో ఒకే స్పెల్‌లో జరుగుతాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 7,846 మంది హాజరు కానున్నారు. 6,127 మంది ఎంపీసీ విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానుండగా, 1,719 మంది బైపీసీ విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రాక్టికల్స్‌కు వస్తారు. పరీక్ష కేంద్రాలు నిర్వహించే సీఎస్‌లకు శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించినట్లు ఇంటర్ పరీక్షల ప్రత్యేకాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. గాలి, వెలుతురు తగినంతగా ఉండాలని, బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉండే విధంగా చూడాలని పరీక్ష కేంద్రాల సీఎస్‌లకు సూచించామన్నారు. విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో ఈ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకునే విధంగా తల్లిదండ్రులు, అధ్యాపకులు చూడాలని ఆయన సూచించారు.

మానవత్వానికి మూలం ఆధ్యాత్మికత

పిఠాపురం: అన్ని మత ధర్మాల్లోని ఆధ్యాత్మికత మానవత్వాన్ని మూలంగా చూపిస్తోందని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి ఉమర్ ఆలీషా అన్నారు. వార్షిక జ్ఞాన మహాసభల్లో భాగంగా రెండో రోజైన శనివారం స్థానిక నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన ఆధ్యాత్మిక సభలో ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

ఫలితం.. త్వరితం

- 'పది' మూల్యాంకనానికి పటిష్ట ఏర్పాట్లు
- మార్చి 31 నుంచి ఏప్రిల్ 8 వరకూ నిర్వహణ
- ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వుల జారీ
- వచ్చే నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	రెగ్యులర్ విద్యార్థులు
కాకినాడ	137	27,856
కోనసీమ	112	18,866
తూర్పు గోదావరి	137	23,681
మొత్తం	386	70,403



అమలాపురంలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం

రాయవరం: పదో తరగతి పరీక్షలకు సర్వం సన్నద్ధమైంది.. ఫలితాలనూ సరైన సమయానికి ఇచ్చేందుకు పటిష్ట ప్రణాళిక అమలవుతోంది. దీనికి ప్రభుత్వ పరీక్షల విభాగం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే మూల్యాంకనాన్ని ప్రారంభించి, సకాలంలో ఫలితాలను ప్రకటించే విధంగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి షెడ్యూల్ విడుదల చేశారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి ఇప్పటికే అసిస్టెంట్, చీఫ్ ఎగ్జామినర్ల జాబితాలను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేస్తోంది.

పరీక్షల ప్రణాళిక ఇది..

పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభమయ్యే పరీక్షలు మార్చి 27న సోషల్ పరీక్షతో ముగియనున్నాయి. సోషల్ పరీక్ష ముగియగానే మార్చి 31 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించి, ఏప్రిల్ 8వ తేదీతో పూర్తి చేస్తారు. మూల్యాంకనాన్ని సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 386 పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు జరుగనున్నాయి.


మూల్యాంకనం జరిగేదిలా..

పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని సకాలంలో అందించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 12వ తేదీలోగా జిల్లా ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఏఈ/సీఈ/స్పెషల్ అసిస్టెంట్ల జాబితాను సిద్ధం చేసుకోవాలి. ఈ నెల 22వ తేదీలోగా డీఈఓ కార్యాలయం సబ్జెక్టు, మీడియం వారీగా మూల్యాంకన ఉపాధ్యాయులను సిద్ధం చేయాల్సి ఉంది. సీనియారిటీ ఆధారంగా మూల్యాంకనానికి హాజరయ్యే ఉపాధ్యాయుల జాబితాను ఈ నెల 29న ప్రకటిస్తారు. మార్చి 7న ఉపాధ్యాయ సంఘాల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. మార్చి 15న అప్‌డేట్ జాబితాను తయారు చేస్తారు. మార్చి 18న ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన వారికి ఉత్తర్వులు అందజేస్తారు. సబ్జెక్టుల వారీగా మూల్యాంకనానికి అవసరమయ్యే ఉపాధ్యాయులతో పాటు 30 శాతం ఉపాధ్యాయులను అదనంగా నియమిస్తారు. మార్చి 19 నుంచి 26వ తేదీలోగా ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన ఉపాధ్యాయులకు సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉత్తర్వులు అందజేస్తారు. ఇదిలా ఉంటే ఉత్తర్వులకు కట్టుబడి షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి. 1:1.3 రేషియోలో ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లను నియమించాలి.

గతేడాది ఇలా..

జిల్లాలోని అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 19 నుంచి 26 వరకూ మూల్యాంకనాన్ని సమర్థవంతంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలకు జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టగా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,84,083 పేపర్లను మూల్యాంకనం చేశారు. తెలుగు 25,168, కాంపోజిట్ తెలుగు 3,457, సంస్కృతం 2,163, హిందీ 29,058, ఇంగ్లిషు 24,209, గణితం 24,017, పీఎస్ 24,781, బయాలజీ 24,781, సోషల్ 26,307, ఒకేషనల్ 142 పేపర్లను మూల్యాంకనం నిమిత్తం జిల్లాకు కేటాయించారు. షెడ్యూల్ ప్రకారం మూల్యాంకనాన్ని నిర్వహించగా, ఒక డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జ్ ఒకరిని, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా ఏడుగురిని, ఏపీసీఓలుగా ఏడుగురు, చీఫ్ ఎగ్జామినర్లుగా 188 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 606, స్పెషల్ అసిస్టెంట్లుగా 250 మందిని నియమించారు.

షెడ్యూల్ ప్రకారం చర్యలు



పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి షెడ్యూల్ విడుదలైంది. దీని ప్రకారం స్పాట్ వేల్యుయేషన్ నియమ నిబంధనల అనుసరించి ఉపాధ్యాయుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశాలిచ్చాం. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఉపాధ్యాయుల జాబితాలను తయారు చేస్తాం.



–నక్కా సురేష్,
అసిస్టెంట్ కమిషనర్,
ప్రభుత్వ పరీక్షల విభాగం,
అమలాపురం

ఎవ్వరికీ మినహాయింపు ఉండదు



మూల్యాంకన విధులకు నియమితులైన వారు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ ప్రక్రియలో ఎవరికీ మినహాయింపు ఉండదు. మూల్యాంకన విధులకు హాజరయ్యే వారు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలి.

–జి.నాగమణి,
ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ,
కాకినాడ

ముందస్తు ప్రణాళిక



గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సమర్థవంతంగా మూల్యాంకన క్యాంప్ నిర్వహిస్తాం. ఇప్పటికే అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని తీసుకున్నాం. ఈ ఏడాది నెల రోజుల ముందుగానే స్పాట్ వేల్యుయేషన్ క్యాంప్ జరుగుతుంది. మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తాం.

–ఎం.కమలకుమారి,
డీఈఓ, అమలాపురం

దశాబ్దాల కల సాకారం

వంతెన నిర్మాణానికి రూ.1.01 కోటి మంజూరు



శిథిల స్థితికి చేరిన కాజ్‌వే

మామిడికుదురు: దశాబ్దాల నాటి కల సాకారం అవుతోంది. వంతెన నిర్మాణానికి బాట పడుతోంది. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై లూటుకుర్రు– పాశర్లపూడి లంక గ్రామాల మధ్య కాజ్‌వే శిథిలావస్థకు చేరుకుంది. దీనిని సమూలంగా తొలగించి కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.01 కోట్లు మంజూరు చేసింది. పనుల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ కూడా మొదలైంది. బ్రిటిషు కాలంలో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై నిర్మించిన కాజ్‌వే చాలా కాలం కిందట శిథిలమైంది. ఇటీవల కాలంలో అది మరింత కుంగిపోయింది. రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడికుదురు మండలంలోని వేలాది ఎకరాల నుంచి ముంపునీరు ఈ కాజ్‌వే మీదుగా ఏటా వైనతేయ గోదావరి నదిలో కలుస్తుంది. ఈ కాజ్‌వే పాడైపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీరు సక్రమంగా దిగక పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. ఈ కాజ్‌వేను పునర్నిర్మించాలని చాలా కాలంగా రైతులు, ప్రజలు కోరుతున్నా, పరిష్కారం మాత్రం లభించలేదు. కలెక్టర్ హిమాన్షు శుక్లాకు కాజ్‌వే పరిస్థితిపై జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కొరెడ్డి అంజిబాబు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి కార్యాచరణ చేపట్టారు. వంతెన నిర్మాణానికి రూ.41.60 లక్షలు కేటాయించారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ రూ.25 లక్షలు మంజూరు చేశారు. జిల్లా పరిషత్ ద్వారా రూ.35 లక్షలు వెరసి, రూ.1,01,60,000తో వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచామని పీఆర్ డీఈఈ (ప్రాజెక్టు) అన్యం రాంబాబు శనివారం తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మన్నే రామదాసు, ఆయన అనుచరులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కాలనీకి చెందిన మన్నే రామదాసు ఆధ్వర్యంలో ఆయన అనుచరులు 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక 27వ వార్డు ఈడబ్ల్యూ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. రామదాసుకు విశ్వరూప్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అలాగే టీడీపీ నాయకులు మన్నే బ్రహ్మానందం, బండి రమేష్, సజ్జ ప్రసాద్, శీలం కోటేశ్వరరావు తదితరులు పార్టీలో చేరారు. మున్సిపల్ కాలనీకి చెందిన అగ్నికుల క్షత్రియ నాయకుడు పాలెపు చిన్న గంగరాజు తన అనుచరులకు మంత్రి పార్టీ కండువాలు వేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు రామదాసు, పాలెపు చిన్న గంగరాజు ప్రకటించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు బండారు గోవిందు, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయండి

డీఈఓ కమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

సాక్షి, అమలాపురం: ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముందస్తు ఏర్పాట్లపై జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. డీఈఓ మాట్లాడుతూ విద్యా, వైజ్ఞానిక సదస్సును చక్కని ప్రణాళికతో విజయవంతం చేయాలన్నారు. ప్రదర్శనకు వచ్చే విద్యార్థినీ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మండలం, జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా తిలకించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆమె ఎంఈఓలను ఆదేశించారు. ముఖ్యంగా ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసే విధానం రెండు అంచెలంచెలుగా జరుగుతుందన్నారు. నిష్ణాతులైన వ్యక్తులను న్యాయ నిర్ణేతలుగా నియమించామన్నారు. ఎన్ఐఎఫ్ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు చేస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఎంఈఓ దుర్గాదేవి, హెచ్ఎంలు రాజరాజేశ్వరి, నిమ్మకాయల గణేశ్వరరావు, బీర హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం

అర్తమూరులో ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



అర్తమూరులో ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రకృతి వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల వినియోగంతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ రమణ, రైతు సాధికార సంస్థ థీమేటిక్ లీడ్ రాము ఏలూరి అన్నారు. మండపేట మండలం అర్తమూరులో శనివారం ప్రకృతి వ్యవసాయ అనుబంధ ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బాపుల్ రెడ్డి నిర్వహణలో ఆర్గానిక్ ధాన్యం ప్రాసెసింగ్ సెంటర్ మొత్తం పూర్తి సోలార్ ఆధారంగా నడుస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ, సెల్కో ఫౌండేషన్ల సహకారంతో సోలార్ యూనిట్ ఉచితంగా సమకూరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ 35 శాతం రాయితీ కల్పించిందన్నారు. సెంటర్ ద్వారా రోజుకు సుమారు రెండు మెట్రిక్ టన్నుల ప్రకృతి సాగుకు సంబంధించిన ధాన్యం ప్రాసెస్ చేయవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతు సాధికార సంస్థలు సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయ ఆధారిత ఉత్పతుల ప్రాసెసింగ్ సెంటర్ల నిర్వహణను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ సెంటర్ల ఏర్పాటుతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ పంటలను తామే స్వయంగా ప్రాసెస్ చేయించుకుని మార్కెట్‌లో విక్రయించుకొనే సదుపాయం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఎలియాజర్, శ్రీనివాస్, సత్యనారాయణ, మహమ్మద్ వలీ, సెల్కో ఫౌండేషన్ ప్రతినిధులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవిలా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఊపిరితిత్తుల మార్పిడికి రూ.20 లక్షలు
- బాధిత కుటుంబానికి మంత్రి పినిపే అందజేత



బాధిత కుటుంబానికి రూ.20 లక్షల వైద్య సాయం పత్రాన్ని అందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పేదల ఆరోగ్యానికి ఆపద్బాంధవిలా ముఖ్యమంత్రి సహాయ నిధి మారిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కామనగరువు ఎంఎస్ఎన్ కాలనీకి చెందిన కంచర్ల భైరవమూర్తికి ఊపిరితిత్తుల మార్పిడి నిమిత్తం రూ.20 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయ్యాయి. ఈ మొత్తానికి సంబంధించిన పత్రాన్ని శనివారం భట్నవిల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బాధితుని కుటుంబ సభ్యులకు విశ్వరూప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ కింద పేదల వైద్య చికిత్సకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాల వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులన్నారు. దీని కింద ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పొందవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులు తమ దరఖాస్తులను తహసీల్దార్ ద్వారా కలెక్టర్‌కు పంపితే అర్హత ఉంటే సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయానికి ప్రభుత్వానికి సిఫారసు చేస్తారన్నారు. ప్రజాప్రతినిధుల ద్వారానైనా ప్రభుత్వానికి లేదా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపవచ్చన్నారు. వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం అనుమతించిన తరువాత చికిత్స పొందాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని వ్యాధులకు చికిత్స అందిస్తున్నారని, రూ.25 లక్షల విలువైన వైద్య సాయం పొందవచ్చని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని కేసులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వంకాయల కాశీ, నూలు రమేష్, ఉండ్రు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంతర్యామి.. సదా స్మరామి


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

- భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం
- రూ.35.77 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: సర్వాంతర్యామి.. సదా స్మరామి అంటూ ఆ వాడపల్లి స్వామిని భక్తజనం కొలిచింది. గోవింద హరి గోవిందా అంటూ మనసారా స్మరించింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వేంచేసియున్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.35,77,736 ఆదాయం సమకూరింది. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


వెంకన్న ఆలయం వద్ద అశేష భక్తజనం

పేదల బియ్యం పక్కదారి


శ్రీరామనగరం వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం


అమలాపురంలో స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో అధికారులు

- అధికారుల దాడులు
- రేషన్ బియ్యం పట్టివేత

రాజానగరం: పేదల బియ్యం పక్కదారి పడుతుండడంతో అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. అక్రమార్కులపై కేసులు పెడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకచోట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో మరోచోట ఈ బియ్యం అక్రమ రవాణా గుట్టును రట్టు చేశారు. ముందస్తు సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజానగరం శివారు శ్రీరామనగరం వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ ఎకోమెట్ స్టార్ వాహనాన్ని తనిఖీ చేయగా 122 బస్తాలలో 6,100 కిలోల రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని గుర్తించామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. దీని విలువ రూ. 31.73 లక్షలుగా అంచనా వేశారు. ప్రత్తిపాడుకు చెందిన వాహన యజమాని వెలుగుల కృష్ణ, పార్ట్‌నర్ వెలుగుల గురయ్య (బాబ్జీ)లు ఖమ్మం జిల్లా కల్లూరు నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడుకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. రేషన్ కార్డులదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ. 23కు కొనుగోలు చేసి, బి.ప్రతిపాడు పరిధిలోని చేపల చెరువులకు రూ.26కు విక్రయిస్తుంటారు. ఈ మేరకు వాహన డ్రైవర్ కరణం సద్గురుమూర్తి నుంచి వివరాలు తీసుకుని, డ్రైవర్‌తోపాటు ఇద్దరు రవాణాదారులపై 6ఏ కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు, డీఎస్ఓ భాస్కర్, రాజానగరం సీఎస్‌డీటీ సుందర్, కానిస్టేబుళ్లు లోవరాజు, కిశోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురంలో 1,200 కిలోలు

అమలాపురం రూరల్: అమలాపురం మార్కెట్ వీధిలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలసి ఒక ఇంటిని తనిఖీ చేయగా 24 బస్తాల్లో 1,200 కిలోల బియ్యం గుర్తించారు. ఈ బియ్యం నడిపూడికి చెందిన అరిగెల వీరాంజనేయులుకు చెందినవిగా గుర్తించారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి రూ.22కు పరిసర గ్రామాలకు చెందిన చేపల చెరువులు, బజ్జీల వ్యాపారస్తులకు వీరాంజనేయులు అమ్ముతున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేశామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని అన్నారు. ఈ తనిఖీల్లో కార్యాలయ సీఐ నాగ వెంకటరాజు, ఎస్సైలు జగన్నాథరెడ్డి, అమలాపురం సీఎస్ డీటీ భారతి తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీపై రాకపోకలకు మరో 5 రోజులు బ్రేక్

కొనసాగుతున్న మరమ్మతులు


కాటన్ బ్యారేజ్‌పై రోడ్డును తడుపుతున్న సిబ్బంది

ధవళేశ్వరం: స్థానిక కాటన్ బ్యారేజీపై రోడ్డు మరమ్మతుల నిమిత్తం మరో ఐదు రోజులపాటు రాకపోకలు నిలిపివేయనున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. తొలుత ఈ నెల 10వ తేదీ వరకూ బ్యారేజీపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ నేపథ్యంలో మరో ఐదు రోజులు సమయం కావాలని ఇరిగేషన్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించినట్లు కలెక్టర్ వివరించారు. బ్యారేజీపై రూ.2 కోట్ల ప్రతిపాదనలతో జరుగుతున్న పనులు ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ దశలో ఉన్నాయన్నారు. ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష


పెద్దాపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాలయ ప్రిన్సిపాల్ కమలం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. విద్యాలయలో ఖాళీ సీట్లకు గాను జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 1,587 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,070 మంది హాజరయ్యారు. 517 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి, ప్రిన్సిపాల్ కమలం పరిశీలించారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

తుని రూరల్: తుని మండలం తేటగుంట జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. శనివారం తేటగుంట గ్రామానికి చెందిన కొల్లి నారాయణమ్మ (60) జాతీయ రహదారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి


సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు, క్యూలైన్లు నిండిపోయాయి. సత్యదేవుని సుమారు 25 వేల మంది దర్శించారు. స్వామి వారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈఓ కె.రామచంద్రమోహన్ పర్యవేక్షించారు. కాగా, రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పండితుల పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో మూడుసార్లు మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు.